ఈనాడు
అమరావతి
కృష్ణా
శనివారం అక్టోబరు 5, 2024
5

వేదమూర్తి.. విశ్వదీప్తి





కన్నయ్య సందడి

నాదస్వర నీరాజనం

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి, భవానీపురం, చిట్టినగర్


ఇంద్రకీలాద్రిపై దసరా వేడుకలు రెండో రోజు ఘనంగా జరిగాయి. దుర్గమ్మ శ్రీగాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. శుక్రవారం కావడంతో ఉదయం నుంచి క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజామున 4 గంటల నుంచి దర్శనాలకు అనుమతించారు. రాత్రి 11 గంటల వరకూ దర్శనాలు కొనసాగాయి. రెండో రోజు 80 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చి శ్రీగాయత్రీదేవి రూపంలోని అమ్మవారిని దర్శించుకున్నారు. మొదటి రోజు ప్రసాదాలు, దర్శనాలు, పూజల ద్వారా రూ.28 లక్షల ఆదాయం ఆలయానికి సమకూరినట్టు అధికారులు ప్రకటించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీలు కేశినేని శివనాథ్, సీఎం రమేష్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. క్యూలైన్లలో నడిచి.. రెండు కిలోమీటర్ల దూరం వస్తుండడంతో వారికి మధ్యలో మంచినీటి బాటిళ్లు, పిల్లలకు వేడి పాలు అందజేస్తుండడంపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


క్యూలైన్లలో భక్తులు

నేడు అన్నపూర్ణాదేవిగా..

దుర్గమ్మ ఉత్సవాల మూడో రోజు శనివారం అన్నపూర్ణా దేవి రూపంలో భక్తులకు దర్శనమివ్వనుంది.
సమయం: ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు


తల్లీ శరణు


ఆకట్టుకున్న లేజర్ షో


కుంకుమపూజలో


నృత్య విన్యాసం


డప్పు వాయిద్యం..

✷ సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టామని కలెక్టర్ సృజన వెల్లడించారు. క్యూలైన్లలో వస్తున్న భక్తులతో ఆమె మాట్లాడారు. దర్శనం ఆలస్యం అవుతోందని కొందరు భక్తులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అధికారులతో మాట్లాడి.. ఎందుకు ఆలస్యం అవుతోందని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం కావడంతో రద్దీ ఎక్కువగా ఉందని దుర్గగుడి అధికారులు తెలిపారు. ఆలస్యం జరగకుండా దర్శనాలు చేసుకునేలా చక్కదిద్దాలని ఆమె సూచించారు.


కలెక్టర్ సృజనకు అమ్మవారి పటం అందిస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు


నగరోత్సవంలో ఉత్సవమూర్తుల ఊరేగింపు

రైల్వే ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తిచేయాలి

ఈనాడు డిజిటల్ - అమరావతి: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో రైల్వే ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్‌లు ఇది వరకే ప్రాజెక్టుల నివేదికలు దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్‌కు సమర్పించారు. వీటిలో గుడివాడ, మచిలీపట్నం, విజయవాడ, భీమవరం, సవారీగూడెం, వీరవల్లి సెక్షన్లలో ఆర్వోబీల నిర్మాణం, ఎల్సీ నం.338లో ఆర్‌యూబీ నిర్మాణం, బందరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ, మోడల్ రైల్వేస్టేషన్‌గా మార్పు, విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి నిధులు, పశ్చిమ పరిధిలో వరద ముంపునకు గురి కాకుండా వించిపేట, పాత రాజరాజేశ్వరి పేట, కబేళా, కేఎల్‌రావు నగర్ తదితర ప్రాంతాల్లో డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలని ఎంపీలు నివేదికలు సమర్పించారు. శుక్రవారం నగరంలోని రైల్వే ఈటీటీసీ కేంద్రంలో రాష్ట్రంలో రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌తో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ.. విజయవాడను డ్రెయినేజీ సమస్య తీవ్రంగా వెంటాడుతోంది. ఇటీవల వర్షాలకు, బుడమేరు వరదకు నగరం అతలాకుతలమైంది. నగరంలో డ్రెయినేజీ శాశ్వత పరిష్కారానికి రైల్వే, రెవెన్యూ, నగరపాలక సంస్థ అధికారులతో జాయింట్ కమిటీ వేయాలని కోరారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, తప్పిదాల వల్లే రాష్ట్రంలో రైల్వే వ్యవస్థ వెనుకబడిందన్నారు. రైల్వే జీఎం అరుణ్‌కుమార్ కూడా జాయింట్ కమిటీ వేయనున్నట్లు చెప్పారు.

పెడనలో రెండు పైవంతెనలకు..

పెడన, న్యూస్‌టుడే: విజయవాడలో శుక్రవారం ద.మ రైల్వే నిర్వహించిన ఎంపీల సమావేశంలో పెడనలో రెండు పైవంతెనలకు మచిలీపట్నం ఎంపీ బాలశౌరీ ప్రతిపాదించారు. ద.మ. రైల్వే జీఎం నిర్వహించిన సమావేశంలో బాలశౌరీ మచిలీపట్నం-విజయవాడ సెక్షన్‌లో మొత్తం పది ఆర్వోబీ(పైవంతెన), ఆర్‌యూబీ(అండర్ పాస్)లను నిర్మించాలని సూచించారు. పెడనలోని ఎల్సీ నెం.31 పెడన-గూడూరు రోడ్డులో కొత్తపేట వద్ద ఉన్న రైల్వే గేటు, పెడన-మచిలీపట్నం రోడ్డులో పోలీసుస్టేషన్ సమీపంలో ఉన్న ఎల్సీ నెం.32 రైల్వేగేటు వద్ద వాహనాల రద్దీ అధికంగా ఉంటోందని, ఈ రెండుచోట్ల ఆర్వోబీలను నిర్మించాలని సూచించారు. దిల్లీలో ఉన్న ఎంపీ జీఎంకు ఈ లేఖను పంపించారు.

గన్నవరం.. ఘన వైభవం తథ్యం


హనుమాన్‌జంక్షన్‌లో భారీ కేకు కోస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: గతంలో ఎన్నడూ లేని అధిక మెజార్టీతో ఓటర్లు తనకు అఖండ విజయం సాధించిపెట్టారని, దానిని సద్వినియోగం చేసుకుంటూ మునుపెన్నడూ లేని విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో గన్నవరం ప్రగతికి దూరమైందని, చంద్రబాబు కష్టాలకు కారణమైందన్నారు. ఓటర్లు తమ తీర్పు ద్వారా దానికి కారణమైనవారిని తరిమికొట్టారన్నారు. ఎన్నికల్లో వాగ్దానం చేసినట్లుగా 15వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పించి తీరుతానని, పారిశ్రామికవేత్తల ఊపు చూస్తుంటే ఈ సంఖ్య ఇంకా రెట్టింపైనా ఆశ్చర్యం లేదన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం సాయంత్రం హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయ స్వామి ఆలయంలో యార్లగడ్డ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెదేపా నాయకుడు ఆళ్ల గోపాలకృష్ణ స్థలంలో ఏర్పాటు చేసిన వేదికపై 50 కిలోల కేకు కోశారు. అంతకుముందు యార్లగడ్డను హనుమాన్‌జంక్షన్ బైపాస్ నుంచి అభిమానులు భారీ ప్రదర్శనగా హనుమాన్‌జంక్షన్ కూడలికి తోడ్కొని వచ్చారు. నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు, మూల్పూరి కల్యాణి, వేగిరెడ్డి పాపారావు, గుండపనేని ఉమాప్రసాద్, పుట్టా సురేష్, కొమ్మారెడ్డి రాజేష్, లింగం శ్రీధర్ పాల్గొన్నారు.

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు కమ్మ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, కమ్మ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. విజయవాడ ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బీ బ్లాక్ మూడవ అంతస్తులోని ఈనాడు ఆఫీస్ వేదికగా నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (05 అక్టోబర్ 2024, శనివారం) రేపు (06 అక్టోబర్ 2024, ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు
95501 28306 & 80080 01686 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు పైన తెలియచేసిన వాట్సాప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు.

పరీక్షా కేంద్రాల ఆకస్మిక సందర్శన

పోరంకి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) - 2024 కేంద్రాలను కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారిణి తాహెరా సుల్తానా ఆకస్మికంగా సందర్శించారు. తాడిగడప 100 అడుగుల రోడ్డులోని అయాన్ డిజిటల్ జోన్, సైలెన్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రాలలో వసతులు, ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గంట ముందుగానే అభ్యర్థులు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. రెండు పరీక్షా కేంద్రాలకు వేర్వేరుగా ప్రవేశద్వారాలు ఉన్నాయని తెలిపారు. పెనమలూరు మండల విద్యా శాఖాధికారి బి. వి. శేషగిరిరావు, రెండు కేంద్రాల డిపార్ట్‌మెంటల్ అధికారులు పాల్గొన్నారు.

ఆలపాటిని అత్యధిక ఆధిక్యంతో గెలిపించాలి


ప్రసంగిస్తున్న ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, వేదికపై రాజేంద్రప్రసాద్, వర్ల తదితరులు

పామర్రు, న్యూస్‌టుడే: కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి స్థానిక పాలశీతలీకరణ కేంద్రం కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ పరిచయ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పాటుపడిన విధంగా మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు కృషిచేసి తమ గ్రామాల్లో ఉన్న పట్టభద్రులందర్నీ ఓటర్లుగా చేర్చేందుకు కృషి చేయాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ ముగిసిన అనంతరం కూటమి అభ్యర్థి అయిన రాజేంద్రప్రసాద్‌కు ఓట్లు వేసే విధంగా పట్టభద్రులను చైతన్యవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సభకు అధ్యక్షతవహించి మాట్లాడుతూ గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలో పేద ప్రజలకోసం ఎన్నో సేవలు చేసిన మాజీ మంత్రి, విద్యావంతుడైన రాజేంద్రప్రసాద్‌కు పట్టభద్రులందరూ పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గత అయిదేళ్లలో రాష్ట్రాన్ని, రాజకీయ వ్యవస్థను భ్రష్టు పట్టించిన ఘనత వైకాపాకే దక్కుతుందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తాడిశెట్టి నరేష్, వల్లూరుపల్లి గణేష్, కుదురవల్లి ప్రవీణ్‌చంద్ర, ఈడే నాని, మైనేని ఇందిర, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

91.9 FM Vijayawada — ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కాలేజి స్టైల్	సా. 5 - రా. 9
ఈ స్టార్ మీ స్టార్	రా. 9 - రా. 10
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 10 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 585 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 91699 22299.

WANTED DEALERS/AGENTS

విజయవాడలో గల నెల్లూరు గోలి సోడా కంపెనీకి క్రింది ఇచ్చిన ఏరియాలలో డీలర్స్ కావలెను. ఏలూరు, రేపల్లె, అవనిగడ్డ, నూజివీడు, నందిగామ, గుడివాడ, మచిలీపట్నం. ✆ 94919 75554, 90909 19029

EDUCATION

HOME TUITIONS

Wanted Experienced NEET Tutor for Physics and Chemistry in Vijayawada City. Call: 8919056059

HOME NEEDS

PEST CONTROL

బాలాజీ పెస్ట్ కంట్రోల్ Bayer కెమికల్స్‌తో చెదలు నివారణ 6 సం॥లు వారంటీ. మీ విలువైన వస్తువులకు ఇళ్ళు, ఆఫీసులు, అపార్ట్‌మెంట్స్‌కు చెదలు నివారణ చేయబడును. ✆ 91103 43262, 89853 51383.

PERSONAL CLASSIFIEDS

LOST

విజయవాడ, దుర్గాపురం వాస్తవ్యులు (లేటు) బొమ్మిశెట్టి సత్యమూర్తిగారి భార్య బొమ్మిశెట్టి వరాహలక్ష్మీ సత్యవాతి గారికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు నెం. 8575/06 మొగల్రాజ్‌పురంలోని సిద్ధార్థ అకాడమి దగ్గర ఫొటోస్టాట్ నిమిత్తం వెళుతుండగా మార్గమధ్యలో పోయినది. దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెం. సంప్ర: ✆ 98481 20887.

REAL ESTATE

FLAT FOR SALE

PENAMALURU

గృహప్రవేశంకు సిద్ధముగా విజయవాడ, పెనమలూరులో, MRO ఆఫీస్ వద్ద New DLX 2BHK (1346 S.Ft) ఫ్లాట్స్ - Bank Loan సౌకర్యాలతో 43 లక్షలు. ✆ 97014 83087.

LAND FOR SALE

PENAMALURU

East Face Land For Sale Abutting Kankipadu - Godavarru Road. Contact: 98481 21762

NUNNA ROAD

నున్న Vikas College రోడ్డులో జగనన్న కాలనీ వెనుక 10 సెంట్లు Farm Land కేవలం: రూ. 20 లక్షలకు మాత్రమే లభించును. ✆ 7997800008, 9848665559.

GENERAL

తూ॥గో॥జిల్లా నల్లజర్ల మం॥ పోతవరం గ్రామంలో 4 ఎ॥ 80 సెం॥ లేత పామాయిల్ భూమి & కొయ్యలగూడెం మం॥ పొంగుటూరులో కొయ్యలగూడెం రోడ్‌ను ఆనుకొని 2 ఎ॥ 09 సెం॥ కొబ్బరితోట అమ్మకము. Cont: 98494 38306.

PLOT FOR SALE

PENAMALURU

దసరా ధమాకా ఒక ప్లాట్ కొంటే 2 వ ప్లాట్‌పై 50% డిస్కౌంట్ CRDA/ RERA అప్రూవ్డ్ బందర్ రోడ్/ ఈస్ట్ బైపాస్/ ORR కు అతి చేరువలో. ✆ 9440503387.

TADEPALLI

DGP ఆఫీస్ కేవలం 1KM పరిధిలో, వడ్డేశ్వరంలో ఇళ్ళ ప్రక్కన నాన్ లేఅవుట్ ప్లాట్లు కలవు. చ॥ గజం కేవలం 14,000/- మాత్రమే. ✆ 99636 43786.

GENERAL

దసరా కానుక : గోసాల చైతన్య కాలేజీకి దగ్గరలో అతిపెద్ద వెంచర్‌లో.. లేఅవుట్ ప్లాట్లు, గేటెడ్ కమ్యూనిటీలో ఇండిపెండెంట్ హౌస్‌లు విల్లాస్, అపార్ట్‌మెంట్స్ అతితక్కువ ధరలలో అమ్మబడును. ✆ 70950 59166.

దసరా ఆఫర్ - 16 గ్రా॥ గోల్డ్ ఫ్రీ. కంచికచర్ల దగ్గర, ఇళ్ళ ప్రక్కన, ORRకు 200 మీ॥, Hyd హైవేకి 4KM, అమరావతికి 15KM, CRDA వెంచర్, బ్యాంకు లోన్, స్పాట్ రి॥ ✆88018 03689.

గన్నవరం, ఎయిర్‌పోర్టు ఎదుట, దుర్గాపురం, RTC అకాడమీ శివాలయం దగ్గరలో 180 చ॥గ॥ తూర్పు ఫేస్ 65x45 కొలతలతో గల ప్లాట్ అమ్మకంనకు కలదు. ✆ 98493 72532.

LEASE

గూడవల్లిలో మా 2 ఎకరములలో మీరు కోరిన విధముగా స్కూల్స్ & డే స్కాలర్స్ కాలేజీలకు, ఇన్స్టిట్యూషన్‌కు అన్ని సౌకర్యములతో కట్టించి అద్దెకు ఇవ్వబడును. ✆ 93946 26067.

TO LET

COMMERCIAL

Centrally located area of 2000 Sq.Ft, 100 Mts from National Highway, ground floor, besides SBI, suitable for hospitals, showrooms, financial institutions, software, offices or any commercial use. contact: 9010189888, 8919322073.

NTR కాలనీ, మహానాడు రోడ్డులో కాకతీయ Jewel Apptలో 4250 చ॥అ కమర్షియల్ కాంప్లెక్స్, షాపింగ్ కాంప్లెక్స్, షోరూమ్స్, బ్యాంకులకు, సూపర్ మార్కెట్స్‌కు అద్దెకు ఇవ్వబడును. ✆ 92464 78333.

20 ఫీట్ ఎత్తు షట్టర్‌తో, 500 meters నేషనల్ హైవే నుండి, office space available, 6000 sq.feet గోడౌన్ లారీ లోనకి వెళ్లే సౌకర్యముతో, గోడౌన్ గన్నవరంలో అద్దెకు కలదు. సంప్రదించండి: 8919322073

JOBS

విజయవాడలోని ప్రముఖ స్వీట్స్ షాపులో పనిచేయుటకు ఇంచార్జ్, సేల్స్, వేర్‌హౌస్ హెల్పర్స్, ప్యాకింగ్ సిబ్బంది కావలెను. ఆసక్తి ఉన్నవారు సంప్ర. ✆ 99514 57246, 90301 83455.

RKs రాయల్ అసోసియేషన్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, రిసెప్షనిస్ట్ కావలెను. Qul: ఇంటర్, డిగ్రీ, Salary + ఇన్‌సెంటివ్స్. ✆ 72072 69033 / 91822 11677.



Wanted Male Marketing Staff. Salary upto: 16000/- and Female Telecallers. Salary upto: 12000/- Qualification: Any Inter/ Degree. Age Limit: 21 to 45 years. Location: Vijayawada. Contact: 89781 80832.

ఓమెగా హోంకేర్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం 20K. ✆ 89776 39662, 89776 63663.

ఎన్టీఆర్ కృష్ణ జిల్లాలో కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్ లీడర్స్ అండ్ లేడీ టెలికాలర్స్ కావలెను. సంప్రదించవలసిన నెంబర్: ✆ 90322 31756, 70139 00014.

కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్ (స్త్రీ) కావలెను. ఇంటర్‌నేషనల్ రిప్యూటెడ్ మేట్రిమోనియల్ కన్సల్టెన్సీ విజయవాడ బ్రాంచి కొరకు ఫోన్. 9989997766.

Office Boy & House Keeping కావలెను. తాడేపల్లిలో పనిచేయుటకు, జీతం: 12,000/- to 15,000/-. వివరాలకు ✆ 72880 04466

లేడీ టెలికాలర్స్ ప్రముఖ ఆఫీస్ నందు పనిచేయుటకు కావలెను. Q: 10th/ ఇంటర్. కంప్యూటర్ Knowledge తప్పనిసరి. జీతం: 10 to 12 వేలు + ఇన్సెంటివ్స్. ✆ 99669 88544, 99124 21589.

ప్రముఖ కంపెనీ యందు పనిచేయుటకు కార్మికులు కావలెను (తిరుపతి) Qualification: ITI/ Diploma Contact numbers: 63046 60778, 99499 33121.

విజయవాడలో ప్రముఖ హాస్పిటల్‌లో ANM, GNM, B.Sc Nursing చదివి అనుభవం ఉన్నా లేని మహిళలు & ఆయాలు కావలెను. సంప్ర: 93973 41745.

మొబైల్ యాప్స్ టెక్నాలజీపై అవగాహన, ఫైనాన్స్ సంస్థలో పనిచేయుటకు యువతి/ వివాహితలు కావలెను. సంప్రదించండి. ✆ 98660 48567.

త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం. 17K. ✆ 85209 80099, 85208 74499.

హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను/ పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 96405 28899, 96406 48899.

FACULTY/ TEACHERS

Wanted Teachers: English- Classes (1 to 5) Salary 10K to 15K, English - Classes (6 to 8) Salary 15K to 20K, English - Classes (8 to 10) Salary 25K to 30K. We Require Experienced and Dedicated Faculty. Contact. ✆ 79811 80033, 91767 67329.


గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గుడివాడ
• గుడివాడ • పామర్రు • అవనిగడ్డ

'గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తా'

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తానని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ మండలం దొండపాడు గ్రామంలో రూ. 42.75 లక్షలతో 11 సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోని దొండపాడు గ్రామ ప్రధాన రహదారి అభివృద్ధికి రూ. 40 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి శక్తివంచన లేకుండా శ్రమిస్తానన్నారు. అనంతరం గ్రామంలో ప్రజా వేదిక నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో జి.బాలసుబ్రమణ్యం, తహసీల్దారు రామకోటేశ్వరరావు, ఎంపీడీవో విష్ణుప్రసాద్, సర్పంచి చోరగుడి సురేఖ, మండల తెదేపా అధ్యక్షుడు వాసే మురళీ, నాయకులు ముసునూరు రాజేంద్ర ప్రసాద్, లింగనేని వీర బసవయ్య, నూతక్కి కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాము

ఉద్యోగ మేళాకు స్పందన

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: యువతలో నైపుణ్యాలు వెలికి తీసి వారికి ఉత్తమ ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవరపల్లి విక్టర్ బాబు పేర్కొన్నారు. స్థానిక కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా శాఖ, డీఆర్‌డీఏ-సీడాప్, ఐటీఐ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్వ్యూకు 65 మంది హాజరుకాగా 10 మందికి ఉపాధి లభించగా మరో 28 మందిని షార్టు లిస్టు చేశారన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.సురేష్ కుమార్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఎల్.గౌరీమణి, నేషనల్ కెరీర్ సర్వీస్ యంగ్ ప్రొఫెషనల్ ఎస్.జయరాజు తదితరులు పాల్గొన్నారు.

సెరీకల్చర్‌కు మంచి రోజులొస్తాయి : మండలి

చల్లపల్లి, న్యూస్‌టుడే: సెరీ కల్చర్‌కు తమ ప్రభుత్వంలో మంచి రోజులొస్తాయని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చల్లపల్లి మండలం వెలివోలు గ్రామంలో శుక్రవారం చల్లపల్లి, ఘంటసాల మండలాల వరద బాధిత పట్టు పరిశ్రమ రైతులకు పట్టు పురుగుల ఔషధాలు ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఏపీ పట్టు పరిశ్రమ సహకారంతో రెయిన్‌బో ఆగ్రో వెట్ సిరి టెక్నాలజీస్ ఎండీ బోడిచర్ల వెంకట సుబ్బారాయుడు ఆధ్వర్యంలో సెరీకల్చర్ డీడీ దిరిశాల వాణి పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. 100 మంది రైతులకు రూ.2లక్షల విలువైన ఔషధాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సర్పంచ్ రజిత, వైస్ ఎంపీపీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


రైతులకు ఔషధాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ఉచిత గ్యాస్‌తో.. తగ్గనున్న వంటింటి భారం

దీపావళి నుంచి మూడు సిలిండర్ల పథకం అమలులోకి

న్యూస్‌టుడే, నాగాయలంక

గృహిణులకు వంటింటి ఆర్థిక భారం తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇప్పటికే ఒక్కొక్కటిగా అమలు చేసి ప్రజల మన్ననలు పొందుతోంది. ఈ క్రమంలోనే ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి రోజున ప్రారంభించనున్నట్లు ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించారు. వైకాపా ప్రభుత్వం గత అయిదేళ్లు రాష్ట్రాన్ని సంక్షోభంలో నెట్టేసినా..ఆయా సవాళ్లను ఎదుర్కొని ప్రజలకు మంచి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు.



డబ్బు ఆదా అవుతుంది: ఈ పథకంపై అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక గ్యాస్ సిలిండర్ ధర రూ. 835 ఉంది. కేంద్ర ప్రభుత్వం రూ. 18 రాయితీ అందిస్తోంది. నలుగురు కుటుంబ సభ్యులు ఎంత పొదుపుగా వాడినా రెండు నెలలకు ఒకటి చొప్పున ఏడాదికి 6 సిలిండర్లు అవసరమవుతాయి. ఇందులో కూటమి ప్రభుత్వం మూడు సిలిండర్లు ఉచితంగా అందించనుంది. దీంతో ఆయా కుటుంబాల వంటింటిపై ఆర్థిక భారం సగం తగ్గినట్లే. ఈ లెక్కన ఒక్కో ఇంటికి ఏడాదికి సగటున రూ. 2,451 ఆదా అవుతుంది. నాగాయలంక, కోడూరు మండలాల్లో దాదాపు 25 వేలు, నియోజకవర్గం మొత్తం మీద 70 వేల కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి.

సంతోషంగా ఉంది



ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తే అంతకంటే ఆనందం మరొకటి ఉండదు. గ్యాస్ కోసం చేసే ఖర్చుని మరో అవసరానికి వాడుకుంటాం.
- ముమ్మారెడ్డి కల్పన, భావదేవరపల్లి

మేలు జరుగుతుంది



ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. పొదుపుగా నడుచుకునే చిన్న కుటుంబాలకు ఏడాదికి మూడు సిలిండర్లు సరిపోతాయి. దీంతో వంటగ్యాస్ రూపేణా ఎలాంటి ఆర్థిక సమస్య ఉండదు. **- తాడేపల్లి శ్రీజానకి, నంగేగడ్డ**

చంద్రబాబుపై నమ్మకం పెరిగింది



గ్యాస్ సిలిండర్ల కొనుగోలు విషయంలో ప్రతి ఇంటికీ ఆర్థిక భారం అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ పథకం అమలు చేయడం సంతోషంగా ఉంది. దీపావళి నుంచి మూడు సిలిండర్లను ఇస్తామని ప్రకటించడం సీఎం చంద్రబాబుపై మరింత నమ్మకం పెరిగింది. **- వెంకటలక్ష్మి, టి.కొత్తపాలెం**

నేడు విద్యుత్తు సరఫరా ఉండని ప్రాంతాలు

పెదపారుపూడి: విద్యుత్తు లైన్లు, ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్తు శాఖ డీఈ జి.పి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాలకేంద్ర భవనం ప్రారంభం

ఉలవలపూడి (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: ఉలవలపూడిలో నిర్మించిన విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రం భవనాన్ని సర్పంచి పామర్తి కన్య భాస్కరరావు శుక్రవారం ప్రారంభించారు. పంచాయతీ స్థలంలో రూ. 1.7 లక్షలతో నిర్మించిన పాలకేంద్రం ద్వారా గ్రామంలోని పాడిరైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని భాస్కరరావు పేర్కొన్నారు. గ్రామ పాల సొసైటీ అధ్యక్షుడు పామర్తి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు, దోమతెరల పంపిణీ

పులిగడ్డ (అవనిగడ్డగ్రామీణం), న్యూస్‌టుడే: పులిగడ్డ పంచాయతీ పరిధిలోని 275 మంది వరద బాధితులకు వైద్య, ఆరోగ్యశాఖ పర్యవేక్షకుడు కేటీ రామారావు నేతృత్వంలో సిబ్బంది సమకూర్చిన దుప్పట్లు, దోమతెరలు సర్పంచి దాసరి విజయ్‌కుమార్ శుక్రవారం అందించారు. ఉప సర్పంచి మండలి వెంకటేశ్వరరావు, కేటీ రామారావు, ఈవో అనిత తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతోనే దేశాభివృద్ధి

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: నేటి యువత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంటేనే దేశం ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన అక్కినేని నాగేశ్వరరావు కళాశాల స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ దేశ భవిత యువతపైనే ఆధారపడి ఉందన్నారు. యువత శాస్త్ర సాంకేతిక రంగాల్లో పట్టు సాధించాలన్నారు. దేశ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిస్తూ జన్మభూమి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎంసీఏ, ఎంబీఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్స్, ఎమ్మెస్సీ రసాయన శాస్త్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన సీహెచ్.సుమశ్రీ, పి.లావణ్య, టీఎల్‌కే.శ్రావ్య, జేవీ మణికంఠలను సత్కరించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు ఎల్ఆర్‌కే.ప్రసాద్, సెక్రెటరీ, కరస్పాండెంట్ కె.ఎస్.అప్పారావు, ప్రిన్సిపల్ డాక్టర్ పీజేఎస్.కుమార్, వైస్ ప్రిన్సిపల్ బీఎస్ఎస్.పద్మజ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం.రవి సుందర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


అతిథులతో ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

కూటమి శ్రేణుల నిరసన

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలకు కూటమి శ్రేణులు శుక్రవారం భగ్గుమన్నాయి. వంతెన కూడలిలో నిరసన వ్యక్తం చేస్తూ విజయసాయి రెడ్డి చిత్రపటాన్ని దహనం చేశారు. తెదేపా నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ మాట్లాడుతూ.. నిరుద్యోగుల విలువైన 5 ఏళ్ల జీవితాన్ని వైకాపా ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ అని నిరుద్యోగులను మోసం చేశారని, వైకాపా ప్రభుత్వం ఒక్క డీఎస్సీ నిర్వహించిందా అని ప్రశ్నించారు. అనంతరం విజయసాయిరెడ్డి చిత్రాలను దహనం చేశారు. నాయకులు బచ్చు రఘునాథ్, మండలి రామ మోహన్‌రావు, ప్రసాద్, బాబావలి, మురాద్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు కోతలపై ఆందోళన

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: మండల పరిధిలోని నాయుడుపేటలో గత పది రోజులుగా రాత్రి సమయంలో విద్యుత్తు కోత విధిస్తుండటంతో విసిగిపోయిన ఆ గ్రామస్థులు శుక్రవారం రాత్రి కోడూరులోని విద్యుత్తు ఉప కేంద్రాన్ని ముట్టడించి ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులకు చెపుతుంటే ఏసీలు వాడకం పెరగడంతో ట్రాన్స్‌ఫారమ్స్ వద్ద సమస్య వస్తోందని చెపుతున్నారే గాని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని గ్రామస్థులు పట్టుదలతో ఉన్నారు.


సబ్‌స్టేషన్ ముట్టడించిన నాయుడుపేట గ్రామస్థులు

సర్వసభ్య సమావేశం వెలవెల

వైకాపా మహిళా ఎంపీటీసీ సభ్యులు, అధికారుల డుమ్మా

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: అవనిగడ్డ మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో అజెండాపై వైకాపా ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీవో మరియాదేవితో వాగ్వాదానికి దిగారు. సమాచారం లేకుండా ఉపాధి హామీ పథకం కింద మండలంలో 49 సీసీ రహదారులు, 7 మురుగు కాల్వల అభివృద్ధి, 22 గోకులం షెడ్లు, గొర్రెల షెడ్లతో కలిపి 79 పనులను రూ. 5.5 కోట్లతో చేస్తుండడంతో వారు తర్జనభర్జన పడ్డారు. పంచాయతీల్లో జరిగిన గ్రామ సభల్లో అమోదించినవేనని ఎంపీడీవో పేర్కొన్నప్పటికీ అజెండాను సమర్థించేదిలేదని వారు పట్టు పట్టారు. మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపీపీ తుంగల సుమతి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించగా వైకాపా మహిళా ఎంపీటీసీ సభ్యులు డుమ్మా కొట్టారు. మండలస్థాయి అధికారులు కూడా అదే బాట పట్టారు. 10 మంది సర్పంచులకుగానూ ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు కేసవి, ఉప ఎంపీపీలు పిచ్చేశ్వరరావు, దిడ్ల కిరణ్, జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీవో మరియాదేవితో వాదులాడుతున్న ఉప ఎంపీపీ దిడ్ల కిరణ్, కో-ఆప్షన్ సభ్యుడు నజీర్

రైతులకు అండగా లయన్స్‌క్లబ్

మోపిదేవి,న్యూస్‌టుడే: కృష్ణానదికి ఇటీవల వచ్చిన భారీ వరదల నేపథ్యంలో పంటలు నష్టపోయిన రైతులకు అండగా లయన్స్‌క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ ఉంటుందని ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం అముదార్లంక గ్రామంలో 32మంది, మోపిదేవి మండలంలో నలుగురు రైతులకు 36 పవర్ స్ప్రేయర్లను పంపిణీ చేశారు. కోసూరు శివాజీ, రాధాకృష్ణ, చిబాబే, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

లడ్డూలో కల్తీనెయ్యి వాడకం అపచారం

పులిగడ్డ (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: తిరుమల వెంకటేశ్వరస్వామివారి లడ్డూ ప్రసాదంలో కల్తీనెయ్యి వినియోగం మహా అపచారమని కూటమి నేతలు, విశ్వహిందూపరిషత్తు సభ్యులు అన్నారు. పులిగడ్డ ప్రధానవీధుల్లో శుక్రవారం నమో వెంకటేశాయా.. అంటూ సంకీర్తన చేస్తూ గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయాన్ని శుభ్రపరచి వెంకటేశ్వరస్వామికి ధన్వంతరాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు.

అత్యాశకు వెళ్లి.. జైలుపాలు

* పురాతన విగ్రహం చోరీ * ఐదుగురు యువకుల అరెస్టు

టేక్మాల్, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ చదివి జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాల్సిన యువకులు అత్యాశకు పోయి జైలుపాలయ్యారు. జైన విగ్రహాన్ని చోరీ చేసి విక్రయించేందుకు సిద్ధమైన ఐదుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి శుక్రవారం వివరాలు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంటకు చెందిన అనువింద్, జగత్, పెద్దపేటకు చెందిన శుభానంద్, కృష్ణా జిల్లా చల్లపల్లి గ్రామానికి చెందిన తేజసాయిబాబు, పామర్రుకు చెందిన మహేశ్‌బాబు హైదరాబాద్‌లో బీటెక్ చదివారు. రాత్రికిరాత్రే డబ్బులు సంపాదించాలని యూట్యూబ్, సామాజిక మాధ్యమాల ఆధారంగా పురాతన దేవాలయాలు గుర్తించారు. వెల్పుగొండలోని గుట్టపై పార్శ్వనాథుని పురాతన విగ్రహం ఉన్న విషయం తెలుసుకున్నారు. జులై 26న ఇక్కడికి చేరుకొని విగ్రహాన్ని తీసుకెళ్లారు. విగ్రహానికి సరైన ధర రాకపోవడంతో అమ్మలేదు. గ్రామస్థుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఐదుగురు నిందితులను పట్టుకున్నారు. విగ్రహాన్ని గ్రామస్థులకు అప్పగించి, నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి, టేక్మాల్ ఎస్సై రాజేశ్‌లు ఉన్నారు. వెల్పుగొండ మాజీ సర్పంచి నారాయణతో పాటు గ్రామస్థులు ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి డీఎస్పీ, సీఐ, ఎస్సైలను సన్మానించారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి


నాగాయలంక, న్యూస్‌టుడే: అనుమానాస్పదంగా ఓ వ్యక్తి నదిలో పడి మృతి చెందిన ఘటన నాగాయలంకలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై కె.రాజేష్ తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అలపర్తి దుర్గాప్రభాకర్‌రావు(64) రోజూ ఉదయం కృష్ణా నదిలో స్నానంచేసి పక్కనే ఉన్న శివలింగాన్ని దర్శించుకుని ఇంటికి వెళ్తుండేవాడు. అదే క్రమంలో గురువారం స్నానానికి వెళ్లిన ప్రభాకరరావు ఇంటికి తిరిగిరాలేదు. ఆయన భార్య దుర్గశివ నాగకుమారి, బంధువులు ఎంత వెతికినా కనిపించలేదు. శుక్రవారం ఉదయం శవమై ఒడ్డుకు కొట్టుకొచ్చాడు. స్నానానికి వెళ్లిన ప్రభాకరరావు కాలు జారి ప్రమాదవశాత్తు నదిలో పడి మృతి చెంది ఉంటాడని భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అగ్నిప్రమాదంలో గృహం, పశువుల చావిడి దగ్ధం

కోడూరు (అవనిగడ్డ): నక్కవానిదారిలో అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో పచ్చా వీరబాబుకు చెందిన పూరి గృహం, పశువుల చావిడి కాలిపోయాయి. వీరబాబు కుటుంబం కట్టుబట్టలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ప్రమాదంలో 4 పశువుల శరీరం కాలి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనలో వీరబాబుకు చెందిన మోటారు సైకిలు, కొన్ని పత్రాలు, తదితరాలు కాలిపోయాయి. అగ్నిమాపక అధికారులు రూ. 2.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. వీరబాబు గృహాన్ని పరిశీలించిన అవనిగడ్డ సీఐ యువకుమార్ బాధిత కుటుంబానికి రూ. 10వేలు ఆర్థిక సహాయం అందించి ధైర్యం చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గుడివాడ గ్రామీణం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు పేర్కొన్నారు. స్థానిక కేటీఆర్ మహిళా కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో వనం మనం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కళాశాల సెక్రెటరి నిర్మల, ప్రాంతీయ ఛైర్మన్ రాంబాబు, జోన్ ఛైర్మన్ కిషోర్, లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి అధ్యక్షుడు శేషగిరిరావు, కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.


అవనిగడ్డ సుగాలి కాలనీలో..


కోడూరులో ..


మందపాకలలో ..


వేకనూరులో ..


అశ్వరావుపాలెంలో..


చల్లపల్లిలో..


మోపిదేవి: కొక్కిలిగడ్డలో..


నాగాయలంకలో..


గణపేశ్వరంలో..


గుడివాడ భీమేశ్వర స్వామి దేవస్థానంలో..


చిన ఎరుకపాడులో..


పిన్నమనేని నగర్‌లో..

శక్తిస్వరూపిణి.. సకల శుభకారిణి..

దసరా నవరాత్రి వేడుకలు గుడివాడ, పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గాల్లో రెండో రోజు శుక్రవారం వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. పలు చోట్ల ముత్తయిదువ, సుహాసిని పూజలు, చండీయాగం, శ్రీచక్రార్చనలు, స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో, ప్రత్యేక పందిళ్ల వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. **- న్యూస్‌టుడే బృందం**


కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో..


పామర్రులో..


పామర్రు : పర్వతవర్ధని


కొండిపర్రులో..


మొవ్వలో..


కూచిపూడిలో..


తోట్లవల్లూరులో..


వెంట్రప్రగడలో..


పెదపారుపూడిలో..


మేడూరులో..

లలితాత్రిపురసుందరీదేవిగా కొండలమ్మ

వేమవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా వేమవరం కొండలమ్మ దేవస్థానంలో శుక్రవారం అమ్మవారు లలితాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సహస్రనామ కుంకుమార్చన, శ్రీసూక్తహవనం, లలితాహోమం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్‌సేవ, పంచహారతులు, రాత్రికి గుడివాడ పొదర్తి సిస్టర్స్‌చే కూచిపూడి నాట్యం ప్రదర్శించినట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ముందుగా ప్రకటించినట్లు సాంఘిక నాటకం ప్రదర్శనకు ఎస్పీ అనుమతించకపోవడంతో మచిలీపట్నం, పామర్రు సర్కిళ్లకు చెందిన పోలీసులు కళావేదిక వద్దకు చేరుకొని నాటకం ప్రదర్శించవద్దని స్పష్టం చేయడంతో యువత అసంతృప్తి వ్యక్తం చేశారు.



పంచలోహ విగ్రహాల వితరణ

మోపిదేవి, న్యూస్‌టుడే: తోట్లవల్లూరు మండలం దేవరపల్లికి చెందిన గండు సురేష్‌బాబు-నాగశ్రీలక్ష్మి దంపతులు శుక్రవారం పంచలోహాలతో తయారు చేయించిన శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. 25కిలోల బరువుగల విగ్రహాన్ని రూ. లక్షతో తయారుచేయించినట్లు దాతలు తెలిపారు. ఆలయ పర్యవేక్షకుడు బొప్పన సత్యనారాయణకు విగ్రహాన్ని అందించగా దాతకు రశీదు ఇచ్చారు. స్వామి దర్శనం అనంతరం దాతను వేద ఆశీర్వచనంతో దీవించి, శేషవస్త్రాలతో సత్కరించి, ప్రసాదాలు పంపిణీ చేశారు.


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పంచలోహ విగ్రహం అందిస్తు న్న సురేష్‌బాబు, నాగశ్రీలక్ష్మి దంపతులు

కనకదుర్గమ్మకు వెండి కవచం

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని కోడూరుకు చెందిన ప్రముఖ వ్యాపారి పోతన ప్రసాద్ దంపతులు కనకదుర్గమ్మ వారికి రూ. లక్ష విలువైన వెండి కవచం సమర్పించారు. కుమారులు, కోడళ్లు సూర్యతేజ, చరణ్‌తేజ దంపతులతో ఆలయానికి వచ్చి ఆలయ కమిటీ వారికి వెండి కవచాన్ని అందించారు.

ఇసుక ఉచితంగా పంపిణీ చేయాలని ధర్నా

గుడివాడ గ్రామీణం: ఉచితంగా ఇసుక ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల్లో వాగ్దానాలు చేశారని. . అధికారం చేపట్టినా ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం గుడివాడ కార్యదర్శి ఆర్ సీపీ. రెడ్డి పేర్కొన్నారు. ఇసుక ఉచితంగా ఇవ్వాలని కోరుతూ స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు.


చల్లపల్లి డీటీ, ఆర్ఐలకు వినతిపత్రం అందిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఏలూరు రోడ్డులోని సీపీఐ సెంటర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణకార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకుడు గూడపాటి ప్రకాష్ బాబు, జిల్లా కన్వీనర్ కొమ్ముల సురేష్, షేక్ ఖదీర్, ఎం.శేఖర్, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి, న్యూస్‌టుడే: ఇసుక అందుబాటులో ఉంచాలని, భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని, ఇసుక క్వారీల్లో అవినీతి లేకుండా చూడాలని కోరుతూ మొవ్వ మండలం కూచిపూడి సెంటరులో సీపీఎం కమిటీ సభ్యులు, భవన నిర్మాణ కార్మికులు నిరసన తెలిపారు.

చల్లపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరుతూ సీపీఎం పిలుపు మేరకు చల్లపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ శ్రీలత, ఆర్ఐ కృష్ణమోహన్‌లకు అందించారు.

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి ఎంపీడీవోగా ఏవీ.రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గుడివాడ ఎంపీడీవోగా పనిచేసిన ఆమె బదిలీపై చల్లపల్లి వచ్చారు. చల్లపల్లిలో ఎంపీడీవోగా పనిచేసిన చినరాట్నాలు విస్సన్నపేట బదిలీపై వెళ్లారు.

కోడూరు (అవనిగడ్డ): కోడూరు ఎంపీడీవోగా సుధా ప్రవీణ్ శుక్రవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఆర్.శ్రీనివాసరావును గుంటూరు జిల్లా పెదకాకానికి బదిలీ చేశారు.

అవనిగడ్డ డీఎస్పీ బదిలీ

మచిలీపట్నం, కలెక్టరేట్: డీఎస్పీల బదిలీల్లో భాగంగా అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ బదిలీ అయ్యారు. శుక్రవారం నిర్వహించిన పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు డీజీపీ ద్వారకా తిరుమలరావు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న డీఎస్పీలను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్‌ను విజయవాడ సీఎస్‌బీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

ఆలయ ఛైర్మన్‌గా సీతారాం ప్రమాణస్వీకారం

గుడ్లవల్లేరు: స్థానిక పురాతన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థాన అనువంశిక ధర్మకర్త, ఛైర్మన్‌గా శుక్రవారం వల్లభనేని సీతారాం ప్రమాణస్వీకారం చేశారు. గత ఛైర్మన్ వల్లభనేని వెంకట్రావ్ మృతి చెందడంతో ఆయన సోదరుడు లక్ష్మణరావు కుమారుడు సీతారాంతో గుడివాడ డివిజన్ తనిఖీ అధికారి సుధాకర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని వెంకట్రావ్, తెదేపా జిల్లా మాజీ అధ్యక్షుడు వల్లభనేని బాబూరావు, పోలవరపు సీతారామయ్య, చాపరాల గాంధీప్రసాద్, డాక్టర్ రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురండి

పెనమలూరు: గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలంటూ పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ నియోజకవర్గానికి బదిలీపై వచ్చిన అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన శుక్రవారం వారితో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా సత్వరమే చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వివరించారు. తాడిగడప పురపాలికలో పారిశుద్ధ్య పరిస్థితులపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉయ్యూరు ఆర్డీవో హెలా షారూన్, పురపాలిక కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవోలు ప్రణవి, అనూష, శేషగిరిరావు, తహసీల్దార్లు గోపాలకృష్ణ, భావన్నారాయణ, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌ను పరిశీలించిన సీఆర్‌డీఏ అధికారులు

పెనమలూరు, న్యూస్‌టుడే: గోసాలలో కోలవెన్ను ఛానల్ పక్కనే ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్‌ను సీఆర్‌డీఏ అధికారులు శుక్రవారం పరిశీలించారు. రెండ్రోజుల్లో నోటీసులు ఇచ్చి కఠిన చర్యలు తీసుకోనున్నట్లు వారు వివరించారు. నీటి పారుదలశాఖ అధికారుల నుంచి వివరాలు సేకరించారు.

అంత్యక్రియలకు చేయూత

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు ఇందిరానగర్‌కు చెందిన తాపీ కార్మికుడు కొండ నాగరాజు గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. దహన సంస్కారాలకు కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న కాకాని బాబు, నరసింహారావు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సూచన మేరకు రూ.20వేల నగదు నాగరాజు కుటుంబానికి శుక్రవారం ఉదయం అందజేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో

ఆలపాటిని గెలిపించాలి



ఆలపాటికి తెదేపా నేతలను పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

పెనమలూరు, న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా, గుంటూరు నియోజకవర్గాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం ఖరారైందని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టభద్రలను వందశాతం చేర్పించడం ద్వారా మెజార్టీ రికార్డు స్థాయిలో ఉంటుందన్నారు. ఓట్ల నమోదుకు ఎమ్మెల్యే కార్యాలయంలో కాల్‌సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 1983 నుంచి పార్టీకి విధేయుడిగానే పనిచేస్తున్నానన్నారు. తెదేపా నేతలు అనుమోలు ప్రభాకర రావు, శుభశేఖర్, కోయ ఆనంద్, సుదిమళ్ల రవీంద్ర, కూనపరెడ్డి వాసు, జంపాన గుర్నాథం, రాంకుమార్, పీతాగోపీచంద్, జనసేన నాయకుడు రాజా పాల్గొన్నారు.

ఆటపాటలతో అలరించిన విద్యార్థులు



ఉయ్యూరు, న్యూస్‌టుడే : శ్రీశ్రీ నివాస విద్యాసంస్థలో శుక్రవారం ఫ్రెషర్స్ డే ఉత్సాహంగా కొనసాగింది. సీనియర్ విద్యార్థులు ఇంటర్ జూనియర్ విద్యార్థుల్ని స్వాగతించి ఆహ్వానించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు డైరెక్టర్ డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు బహుమతులు అందించారు.

గాయత్రీదేవిగా జగన్మాత దర్శనం



కంకిపాడు శివాలయంలో మహాలక్ష్మీదేవి రూపంలో.. | కంకిపాడు కన్యకాపరమేశ్వరి మందిరంలో లలితాత్రిపురసుందరీదేవిగా.. | తాడిగడప రామాలయంలో గాయత్రీదేవి అవతారం | ఉయ్యూరు శివాలయంలో బాలా త్రిపురసుందరిగా | గాయత్రీదేవి అలంకారంలో రామవరప్పాడులోని పేరంటాలమ్మవారు



పోరంకి శ్రీనివాసనగర్‌లో గాయత్రీ దేవిగా

న్యూస్‌టుడే బృందం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయా దేవాలయాల్లో అమ్మవారిని శుక్రవారం వివిధ రూపాల్లో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు, మండపాల్లో అమ్మవారు గాయత్రీదేవి, మహాలక్ష్మి, లలితాత్రిపుర సుందరి దేవి, బాలాత్రిపురసుందరీదేవి అలంకారాల్లో భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు, అభిషేకాలతోపాటు కుంకుమార్చన జరిపారు. ఉయ్యూరులోని శ్రీ జగదంబ సమేత సోమేశ్వరాలయం(శివాలయం)లో దేవీశరన్నవరాత్రుల సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గన్నవరం యాదవ రామాలయంలో..



హనుమాన్‌జంక్షన్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో... | ఉప్పులూరులో గాయత్రీదేవిగా.. | రంగన్నగూడెంలో ప్రత్యేక పూజలు | బ్రహ్మచారిణి అలంకరణలో శ్రీ రామ లింగేశ్వరాలయంలోని శ్రీపార్వతీ అమ్మవారు

ఘనంగా యార్లగడ్డ జన్మదిన వేడుకలు



తెదేపా నాయకులతో కలిసి కేకు కోస్తున్న ఎమ్మెల్యే



రామవరప్పాడులో కేకు కోస్తున్న కూటమి నేతలు

రామవరప్పాడు, గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకురాలు తుపాకుల శివలీల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కూటమి నేతలు కొల్లా ఆనంద్, అద్దెపల్లి సాంబశివ నాగరాజు, నబిగాని కొండ, స్వాతి, తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంతో పాటు కేసరపల్లి, బాపులపాడు, ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలాల్లోని పలు ప్రాంతాల్లో వెంకట్రావు పుట్టిన రోజును పురస్కరించుకొని భారీ కేక్‌లను కోశారు. కార్యక్రమంలో తెదేపాతో పాటు ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొనగా పలుచోట్ల అన్నదానం నిర్వహించారు.

మల్లవల్లిలో కొనసాగిన సర్వే

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు మండలం మల్లవల్లిలో చేపట్టిన సర్వే శుక్రవారం కూడా కొనసాగింది. కలెక్టర్ ఆదేశాల ప్రకారం నియమించిన 50 మంది సర్వేయర్లతో కూడిన ప్రత్యేక బృందం రెండో రోజూ సర్వే నిర్వహణలో పాల్గొంది. ఆర్‌ఎస్ నంబరు 5, 11లలో ఉన్న భూముల విస్తీర్ణం తేల్చేందుకు వీలుగా ఈ ప్రత్యేక సర్వే చేపట్టిన సంగతి తెలిసిందే. రైతులు మాత్రం తాము చెప్పిన విధంగా కాకుండా, రెవెన్యూ రికార్డుల ప్రకారమంటూ అధికారులు తమను ఏమార్చుతున్నారంటూ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గుడివాడ ఆర్డీవో సుబ్రమణ్యం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి సర్వే తీరుపై సమీక్ష నిర్వహించారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

ముదునూరు(ఉయ్యూరుగ్రామీణం), న్యూస్‌టుడే : ముదునూరు విద్యుత్తు ఉపకేంద్రంలోని 33కేవీ ఫీడర్, సాయిపురం 11 కేవీ ఫీడర్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ముదునూరు, జబర్లపూడి, సాయిపురం, బోళ్ళపాడు గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణానాయక్ తెలిపారు.

ఉచిత ఇసుకను వెంటనే అమలు చేయాలి



ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

పెనమలూరు, పోరంకి, ఉయ్యూరు, కంకిపాడు గ్రామీణం, గన్నవరం గ్రామీణం, హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : ఉచిత ఇసుక విధానాన్ని వెంటనే అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు శుక్రవారం పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, తహసీల్దారు గోపాలకృష్ణలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడిచినా ఎన్నికల హామీ అయిన ఉచిత ఇసుక విధానాన్ని మాత్రం అమలు చేయడం లేదని విమర్శించారు. అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు వారు పోరంకిలో బందరు రోడ్డుపై సీపీఎం శ్రేణులు ఇసుకను కేజీల చొప్పున విక్రయిస్తూ పోరంకి సెంటర్‌లో శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షేక్ ఖాసిం, అమరయ్య శాస్త్రి, పోతులూరి శ్రీనివాసరావు, పండమనేని శ్రీనివాసరావు, పోతులూరి శ్రీనివాసరావు, మస్తాన్‌వలీ, పాతాళ లక్ష్మి, మాదు నాగేశ్వరరావు, తిరువీధుల చంటి వీసం రవణమ్మ, గుంజి నరసయ్య పాల్గొన్నారు. ✪ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉయ్యూరులో ధర్నా నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బి.రాజేష్, ఉయ్యూరు ఏరియా భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు సిద్ధినేని ప్రసాద్, బుడ మస్తాన్, వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ✪ కంకిపాడు బస్టాండు కూడలిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తాడంకి నరేష్, మండల కమిటీ సభ్యుడు వి.శివశంకర్, భవననిర్మాణ కార్మిక సంఘ నాయకులు ఎం.మాధవరావు, చిన్నకొండయ్య, మాల్యాద్రి, వరాలు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ✪ రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక క్వారీలను సత్వరమే తెరిచి ఉచితంగా సరఫరా చేయాలని సీపీఎం నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, అజ్మీర్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గన్నవరం, ఉంగుటూరు మండల కేంద్రాల్లోని పార్టీ పిలుపు మేరకు శుక్రవారం ఆందోళన చేపట్టారు. నాయకులు పిల్లి రాజారావు, వెన్నూతల సర్పంచి రామ్మోహనరావు, గన్నవరం నాయకులు పాల్గొన్నారు. ✪ బాపులపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం మండల కార్యదర్శి బేతా శ్రీనివాసరావు కార్మిక నాయకులు నల్లి ఆంజనేయులు, తోట సాంబశివరావు, చింతా రాఘవయ్య, వడ్డి గిరిధర్‌తో కలిసి ధర్నా చేసి, తహసీల్దార్ నాగభూషణంకు వినతిపత్రం సమర్పించారు.

ట్రాక్టర్ల స్వాధీనం

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తే సహించేది లేదని కంకిపాడు సీఐ మురళీకృష్ణ, ఎస్సై సందీప్‌లు హెచ్చరించారు. శుక్రవారం ఇసుక అక్రమ రవాణా చేస్తున్నరనే సమాచారంతో మద్దూరులో నిఘా ఉంచి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్‌చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎంపీడీవోగా స్వర్ణలత

గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం మండల పరిషత్తు అధికారిణిగా టి.స్వర్ణలత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. స్థానికంగా పనిచేస్తున్న ఎంపీడీవో సత్యకుమార్ ఉంగుటూరు మండలానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో స్వర్ణలత నియమితులయ్యారు. ఎంపీడీవో స్వర్ణలతకు పలువురు అధికారులు, సిబ్బంది, నాయకులు ఘన స్వాగతం పలికారు.

ఉషారామాకు పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలతో ఛైర్మన్ సుంకర రాంబ్రహ్మం, ప్రిన్సిపల్ ప్రసాద్ తదితరులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: అఖిల భారత సాంకేతిక విద్యా మండలి సంయుక్త సహకారంతో దేశ వ్యాప్తంగా ఉన్నత విద్యామండలి జాతీయ పురస్కారాల్లో ఉంగుటూరు మండలం తేలప్రోలు ఉషారామా ఇంజినీరింగ్ కళాశాలకు వివిధ విభాగాల్లో పలు అవార్డులు లభించాయి. సాంకేతిక కోర్సుల్లో శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న కళాశాలగా, ప్రముఖ ఐటీ, రోబోటిక్స్ సంస్థల ఒప్పందాలతో నిర్వహిస్తున్న కోర్సులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలు లభించినట్లు యాజమాన్యం శుక్రవారం వెల్లడించారు. జాతీయ స్థాయిలో గుర్తింపునకు కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు ఛైర్మన్ సుంకర రాంబ్రహ్మం, ప్రిన్సిపల్ ప్రసాద్ తదితరులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

జనవరి 24, 25 తేదీల్లో రీసెర్చ్ కాన్‌క్లేవ్



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరావు, రత్నప్రసాదు, పాండురంగారావు, తదితరులు

కానూరు, న్యూస్‌టుడే : వీఆర్ సిద్ధార్థ డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయంలో వచ్చే ఏడాది జనవరి 24, 25 తేదీల్లో రీసెర్చ్ కాన్‌క్లేవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లు, వెబ్‌సైట్లను ఆయన ప్రారంభించారు. ఇండస్ట్రీ అకడమిక్ మీట్, హ్యాక్‌థాన్, వెబ్‌థాన్, జర్నల్ పబ్లికేషన్‌లలో పాల్గొనవచ్చన్నారు. విజేతలకు రూ. లక్ష నగదు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సలర్ ఏవీ రత్నప్రసాదు, డీన్ బావినేని పాండురంగారావు, విభాగాధిపతులు రాజేశ్వరరావు, మన్నే సునీత, డి.వెంకటరావు, చావా శ్రీనివాస్, రిజిస్ట్రార్ రవిచంద్, తదితరులున్నారు.

విశ్రాంత హెచ్‌ఎం ఉప్పలపాటి ఇక లేరు

పోరంకి, న్యూస్‌టుడే : ఎంతో మందికి విద్యా బుద్ధులు నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన విశ్రాంత ఉప్పలపాటి రామచంద్రరావు (93) గురువారం పోరంకి నారాయణపురం కాలనీ రోడ్డు మాలక్ష్మి డైమండ్ అపార్టుమెంటులోని నివాసంలో కన్నుమూశారు. ఆయన కుమారుడు శ్రీధర్ ఐసీఏఆర్ సైన్‌టిస్ట్‌గా పనిచేశారు. కుమార్తెలు సాయిలక్ష్మి, సుశీల సంతానం. పలువురు శుక్రవారం పోరంకి తరలివచ్చి ఆయన మృతికి నివాళులర్పించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మద్దూరులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామంలోని గుమ్మడి శివశేషపవన్‌కుమార్ (41) ఆటోనడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఈ నెల 3వ తేదీన పురుగు మందు తాగారు. కుటుంబ సభ్యులు బాధితుడిని విజయవాడలోని ఓ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. కంకిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో పడి యువకుడి మృతి

పెనమలూరు, న్యూస్‌టుడే : చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన తాడిగడపలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... తాడిగడపకు చెందిన మట్టా మోహన్‌కృష్ణ (23) హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదివి ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్నారు. ఈ నెల 2వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఆయన భోజనం చేసి సమీపంలోని చెరువు కట్ట వద్దకు వెళ్లారు. ఎంతకూ ఇంటికి రాలేదు. సెల్‌ఫోన్ పనిచేయకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ కోసం గాలించారు. 3వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో మోహన్‌కృష్ణ స్నేహితుడు సందీప్, శివాజీలు కుటుంబ సభ్యుల వద్దకు వచ్చి చెరువులో ఓ మృతదేహం ఉందని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లి చూశారు. మృతదేహం మోహన్‌కృష్ణదిగా తండ్రి అంకినీడు గుర్తించి బయటకు తీయించారు. శుక్రవారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

జీవో 110 అమలు చేయాలి



వీసీకి వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు

కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం) : జీవో 110 అమలు చేయాలని కోరుతూ కృష్ణావిశ్వవిద్యాలయంలో ఒప్పంద సహాయ ఆచార్యులు శుక్రవారం విశ్వవిద్యాలయం వద్ద నిరసన తెలిపారు. తమ వేతనాలకు సంబంధించిన 2022లోనే ఉత్తర్వులు జారీ అయినా ఇంతవరకు అమలు కాలేదని, తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆర్.శ్రీనివాసరావుకు తమ సమస్యలు వివరించి వినతిపత్రం అందించారు. వెంటనే స్పందించిన ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో కృతజ్ఞతలు తెలిపారు.

వ్యర్థానికి అర్థం

మచిలీపట్నం కార్పొరేషన్,- న్యూస్‌టుడే



సైకిల్ చెయిన్, బోల్టులతో తీర్చిదిద్దిన గిటార్




ప్లాస్టిక్ సీసాలు, ఇతర వ్యర్థాలతో తయారు చేసిన కిచెన్ గార్డెన్



వాడిపారేసిన ఫోమ్‌తో పక్షి బొమ్మ

స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా వ్యర్థాలతో కళాకృతులు తయారు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించాలని కలెక్టర్ బాలాజీ ఆదేశించారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు వ్యర్థాలకు అర్థం చెప్పేలా అనేక కళాకృతులు తీర్చిదిద్ది ఔరా అనిపించుకున్నారు. 800 కళాకృతులు మచిలీపట్నంలోని నోబుల్ కళాశాలలో ప్రదర్శించగా అందరినీ ఆకట్టుకున్నాయి. వాడిపారేసిన పేపరు కప్పులు, ప్లాస్టిక్ సీసాలు అలంకరణ ఆకృతులు, కంప్యూటర్ మౌస్‌లతో రోబో, ఫోమ్‌తో పక్షి, కూల్‌డ్రింక్ మూతలతో ఫ్లవర్ వాజ్, సైకిల్ చెయిన్‌లు, స్క్రూలు, బోల్టులతో తయారు చేసిన గిటార్ ఇలా అనేక ఆకృతులు చూపరులను కట్టిపడేశాయి. తీర్చిదిద్దిన విద్యార్థులతో పాటు వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులు అందరి మన్ననలు అందుకున్నారు.



సీసాలతో జిరాఫీ



మూతలతో ఫ్లవర్‌వాజ్



మౌస్‌లతో రోబో

సీఎం హామీల అమలుకు చర్యలు

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమానికి మచిలీపట్నం వచ్చిన సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీల అమలుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ సీఎం ఇచ్చిన హామీలకు సంబంధించిన స్థితిగతులను సమీక్షించి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆంధ్ర జాతీయ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని సీఎం ఇచ్చిన హామీ అమలుకు సంబంధించి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. ఆంధ్ర జాతీయ విద్యా పరిషత్ పరిధిలో జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఓరియంటల్ హైస్కూల్, బీఈడీ, ఐటీఐ, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యా సంస్థలు నడుస్తున్నాయని, విద్యా పరిషత్ గతం నుంచి రాష్ట్ర దేవాదాయశాఖ పర్యవేక్షణలోనే కొనసాగుతోందని, ట్రస్ట్ బోర్డు కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ప్రిన్సిపల్ మురళీమోహన్ కలెక్టర్‌కు తెలిపారు. బైలాస్‌తో పాటు సమగ్ర నివేదిక సత్వరం అందజేయాలని ఆయన ఆదేశించారు. నగర పరిధిలోని డ్రెయినేజీ సమస్య, బీసీ కమ్యూనిటీహాల్ నిర్మాణం, స్టార్మ్ వాటర్ డ్రెయినేజీ సిస్టం తదితర పనుల పురోగతిని మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో సమీక్షించారు. బందరుపోర్టుకు సంబంధించి ఇప్పటివరకూ పూర్తి చేసిన పనులు, చేయాల్సిన పనులను పోర్టు అధికారుల నుంచి తెలుసుకుని ప్రణాళికతో పనులు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. డీఆర్వో చంద్రశేఖరరావు, సీపీవో గణేష్‌కృష్ణ, కమిషనర్ బాపిరాజు, పరిశ్రమలశాఖ జీఎం వెంకట్రావు, పోర్టు అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

ఇష్టంతో విధులు నిర్వహించండి



పరేడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో అతి కీలకమైన పోలీస్‌శాఖలో విధులను కష్టంగా భావించకుండా ఇష్టంతో నిర్వహించాలని ఎస్పీ ఆర్.గంగాధరరావు సిబ్బందికి సూచించారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే క్రమంలో శుక్రవారం పరేడ్ మైదానంలో ఏఆర్, స్పెషల్‌పార్టీ, హోంగార్డు దర్బార్ పరేడ్ నిర్వహించారు. సిబ్బంది గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఏఆర్ ఏఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్‌తో కలిసి పరేడ్ టర్నోవర్‌ను పరిశీలించారు. శాంతి భద్రతల సమస్య, ఇతర ఘటనల నేపథ్యంలో ఏఆర్, స్పెషల్ పార్టీ, హోంగార్డు సిబ్బంది అవిశ్రాంత పనితీరును అభినందించారు.

ఏజెంట్ల వ్యవస్థ నిర్వీర్యం

మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే: ఎల్ఐసీ ఏజెంట్‌ల వ్యవస్థ నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఎల్ఐసీ ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా నాయకులు అన్నారు. సంఘం కేంద్ర నాయకత్వం పిలుపు మేరకు శుక్రవారం మచిలీపట్నంలో ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నాయకులు కేఆర్‌కే గుప్తా, కె.రాజారావు, ఉయలక్ష్మి, జి.కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం గుడ్లపై విచారణ

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని మాచవరం అంగన్‌వాడీ కేంద్రంలో కోడి గుడ్లు కుళ్లిపోయాయంటూ లబ్ధిదారు ఫిర్యాదు మేరకు సీడీపీవో గ్లోరి విచారణ చేశారు.

సినిమాలు

రేవతి- సత్యం సుందరం, **మినీరేవతి-** రామ్ నగర్ బన్నీ, **సిరివెంకట్:** దేవర, **రామరాజు:** స్వాగ్ **-మచిలీపట్నం కార్పొరేషన్**

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

అర్చకుల వేతనాల పెంపుపై హర్షం



ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్లను సన్మానిస్తూ..

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్చకుల వేతనాలు పెంచి మాట నిలబెట్టుకుందని రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన ప్రతినిధులు అన్నారు. శుక్రవారం ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణను కలిసి సత్కరించారు. అర్చకుల వేతనాలు పెంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర అధ్యక్షుడు వి.రామకృష్ణారావు, నాయకులు లొల్లా కుటుంబ శాస్త్రి, పీసుపాటి రాము, రెండుచింతల జోగిశర్మ, పవన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

చేనేత జౌళిశాఖ డీవోల బదిలీలు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా చేనేత జౌళిశాఖ ఏడీ కార్యాలయంలో డీవోలుగా పి.శ్రీనివాసరావు కోనసీమ జిల్లాకు, ఎస్వీ ఫణిబాబు కాకినాడకు బదిలీ అయ్యారు. వేర్వేరు ప్రాంతాల్లో పని చేస్తున్న ముగ్గురు డీవోలు మచిలీపట్నం కార్యాలయానికి బదిలీ అయ్యారు.

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన పెడన నేతలు

పెడన, న్యూస్‌టుడే: బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, తెదేపా రాష్ట్ర నేత బొడ్డు వేణుగోపాలరావు శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పెడన పట్టణ నేతల్ని రాష్ట్ర అధ్యక్షుడికి పరిచయం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి అత్యధిక మెజార్టీ సాధించడానికి నేతలు చేసిన కృషిని వివరించారు. నామినేటెడ్ పదవుల్లో పెడన నేతలకు సముచిత స్థానాన్ని ఇవ్వాలని సూచించారు. నాయకులు చందన నారాయణ రావు, యక్కల శ్యామలయ్య, బళ్ల ప్రసాద్, యర్రా రాజా తదితరులున్నారు.

జగజ్జననీ.. లోకపావని



మంగినపూడి గంగాపార్వతీదేవి



తపసిపూడిలో వాకాలమ్మ



గోపువానిపాలెంలో..



ఎస్.ఎన్.గొల్లపాలెంలో ఉమాదేవిగా..



కన్యకాపరమేశ్వరి ఆలయంలో ధనలక్ష్మీ..



గీతామందిరంలో లలితాదేవిగా..



ఐదుగుళ్లపల్లిలో గాయత్రీదేవిగా..



పెడన: వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో గాయత్రీదేవిగా దర్శనం

మచిలీపట్నం (గొడుగుపేట), గూడూరు, మచిలీపట్నంరూరల్, పెడన, న్యూస్‌టుడే: నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లో దసరా నవరాత్రులు ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆయా ఆలయాల్లో శుక్రవారం వివిధ అలంకరణలో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. గూడూరు మండలం ఐదుగుళ్లపల్లిలో పార్వతీదేవిని గాయత్రీదేవిగా అలంకరించి పూజలు జరిపించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల రెండోరోజైన శుక్రవారం లోకపావని గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. చేవేంద్రలోని పాండురంగ స్వామి ఆలయంలో దసరా ఉత్సవాల్ని వైభవంగా నిర్వహిస్తున్నారు.



బందరు: కూచిపూడి నృత్య ప్రదర్శన



పెడన: చేవేంద్రలో నవరాత్రి పూజలు

కలెక్టర్‌ను కలిసిన పలువురు అధికారులు

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాకు నూతనంగా బదిలీపై వచ్చిన పలువురు అధికారులు కలెక్టర్ బాలాజీని మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఎవీవీ సాంబశివరావు, డ్వామా పీడీ ఎన్‌వీ శివప్రసాద్, హౌసింగ్ పీడీ ఎస్.వెంకటరావు, ఈఈ రత్నశ్రీ, తదితరులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువాలతో సత్కరించారు.



కలెక్టర్‌ను సత్కరిస్తున్న దేవాదాయశాఖ ఏసీ సాంబశివరావు

నేడు ప్రజాదర్బార్

బంటుమిల్లి, న్యూస్‌టుడే: తెదేపా మండల కార్యాలయం వద్ద శనివారం ప్రజాదర్బారు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెదేపా మండల కార్యదర్శి బొర్రా కాశీ తదితరులు ప్రకటన ద్వారా తెలిపారు. ఉదయం 9 నుంచి 11గంటల వరకు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



మండలంలోని మల్లేశ్వరంలో పెను ప్రమాదం తప్పింది. ఓ సంస్థకు చెందిన నీటి ట్యాంకర్ రివర్స్ చేసే సమయంలో బ్రేకులు సక్రమంగా పనిచేయకపోవడంతో ఇలా కాలువలోకి జారిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

-బంటుమిల్లి, న్యూస్‌టుడే

చిరువ్యాపారులకు హెల్పింగ్ హ్యాండ్స్ సాయం

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: తలిదండ్రులు లేక తాత, నానమ్మల ఆదరణలో జీవిస్తున్న ముగ్గురు చిన్నారులను ఆదుకునేందుకు విజయవాడకు చెందిన 'హెల్పింగ్ హ్యాండ్స్' ఫౌండర్ చందన వెంకట్ ముందుకొచ్చారు. వారికి జీవనోపాధి కల్పించేలా తోపుడుబండి, కూరగాయలు, ముక్కజొన్న పొత్తుల వ్యాపారానికి కావలసిన వస్తువులను శుక్రవారం అందజేశారు. వృద్ధాప్యంలో ఆర్థిక దుస్థితిలో ఉన్న ఒక మహిళకు కూడా తోపుడు బండిని అందించారు.

సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

పెడన, న్యూస్‌టుడే: స్థానిక తోటమూలకు చెందిన ఇమ్మిడి రామారావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నిరుపేద కుటుంబానికి స్వచ్ఛంద సంస్థ సహాయ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌షాపా రూ.11,500 ఆర్థిక సహాయాన్ని అందించారు.

21 వరకు నందమూరులో టెట్ పరీక్షలు

పెడన: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లు నందమూరు వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్రంలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఈనెల 21వరకు జరుగుతాయని కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డా. బీ.శరన్‌రెడ్డి చెప్పారు. ఉదయం, మధ్యాహ్నం షెడ్యూల్లో మొత్తం 6080 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాయనున్నారు.

భవిత కేంద్రంలో వినికిడి పరీక్షలు

మచిలీపట్నం (గొడుగుపేట): మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలోని జిల్లా బాల భవిత కేంద్రంలో 18 ఏళ్లలోపు వారికి వినికిడి పరీక్షలు నిర్వహించారు. డిసెబుల్ శ్రవణ ఫౌండేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ వినికిడి లోపం ఉన్న పిల్లలకు ఉచితంగా పరికరాలు అందజేస్తామని చెప్పారు. ఆస్పత్రి చెవి, ముక్కు, గొంతు విభాగ వైద్యులు ప్రతిభ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి


మచిలీపట్నం(గొడుగుపేట): క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి జి.గీతాబాయి అన్నారు. శుక్రవారం నగరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ, కుష్టువ్యాధి రహిత జిల్లాగా చేసేందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. వైద్యాధికారులు ఎ.వెంకట్రావు, వేణుగోపాలకృష్ణ, బి.రమాదావు పాల్గొన్నారు.

మంచి వేతనాలతో ఉద్యోగాలు పొందేలా కృషి

కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: విద్యార్థులు మంచి వేతనాలతో కూడిన ఉద్యోగాలు పొందేలా కృషి చేస్తామని కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆర్.శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాంగణ ఎంపిక శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సూపర్ 50, సూపర్ 30 బ్యాచ్‌లు ఎంపిక చేసి శిక్షణ తరగతులు నిర్వహిస్తారని, అత్యధిక విద్యార్థులు రూ.50 లక్షలు, రూ.30లక్షల ప్యాకేజీ ఉద్యోగాలను సాధిస్తున్నారన్నారు. ఇదే తరహా కార్యక్రమాలు కృష్ణా విశ్వవిద్యాలయంలో కూడా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ఇంజినీరింగ్ విభాగ అధ్యాపకులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ విజయకుమారి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో డీన్ సుందరకృష్ణ, శిక్షకులు దుర్గాప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక తక్షణం అమల్లోకి తేవాలి

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానాన్ని ఎటువంటి ఆటంకాలు లేకుండా తక్షణం అమల్లోకి తేవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం కోనేరుసెంటర్‌లో నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి నరసింహారావు, కమిటీ సభ్యులు రాజేష్, పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు కొడాలి శర్మ, చంద్రపాల్, పరసా లక్ష్మి, కోడాలి సుజాత, బూర భవానీ తదితరులు పాల్గొన్నారు.



కోనేరు సెంటరులో సీపీఎం నాయకుల నిరసన

బంటుమిల్లిలో నిరసన..


బంటుమిల్లి, న్యూస్‌టుడే: వెంటనే ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో నెలకొన్న ఇసుక సమస్యను పరిష్కరించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సీపీఎం, ఇతర కార్మిక, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక ఇచ్చి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలంటూ నిరసన తెలిపారు.

కార్మిక సంక్షేమ బోర్డు రావాలి..

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: కార్మికుల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిన కార్మిక సంక్షేమ బోర్డును తక్షణం అమల్లోకి తేవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం నగరంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై.నరసింహారావు, వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కేవీ గోపాలరావు, తదితరులు మాట్లాడారు.













నేటి అలంకారం శ్రీ అన్నపూర్ణా దేవి

5-10-2024, శనివారం



ఉర్వీ సర్వ జయేశ్వరీ జయకరీ మాతాకృపాసాగరీ నారీ నీలసమాన కుంతలధరీ నిత్యాన్నదానేశ్వరీ సాక్షాన్ మోక్షకరీ సదా శుభకరీ కాశీ పురాధీశ్వరీ భిక్షాందేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ॥

చేతిలో రసపాత్రను ధరించి, పరమేశ్వరునికి భిక్ష పెడుతున్న భంగిమలో అన్నపూర్ణాదేవి భక్తులకు దర్శనమిస్తుంది. సకల చరాచర సృష్టికి ప్రాణాధారమైన అన్నం ఈ తల్లి దయవల్లనే లభిస్తుంది. అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపం అని పెద్దలు చెబుతారు. ఈ రూపంలో ఆది పరాశక్తిని అర్చిస్తే బుద్ధివికాసం, సమయస్ఫూర్తి, బుద్ధి కుశలత, వాక్‌సిద్ధి, శుద్ధి కలుగుతాయి. మానవుడ్ని సంపూర్ణుడిగా ఈ తల్లి అనుగ్రహిస్తుంది. అమ్మ ధరించిన అక్షయపాత్ర సకల శుభాలను అందిస్తుంది. బిడ్డల ఆకలి తీర్చడానికి ఆదిపరాశక్తి స్వయంగా అన్నపూర్ణాదేవిగా రావడం ఈ అవతార విశేషం. పరిపూర్ణమైన చిత్తంతో ఆరాధించిన వారి సమస్తపోషణా భారాన్ని ఈమె స్వయంగా వహిస్తుంది. ఓం శ్రీం హ్రీం క్లీం నమో భగవత్యన్నపూర్ణేశి మమాభిలషిత మహిదేవ్యన్నం స్వాహా అనే మంత్రాన్ని జపించి అమ్మకు నివేదన చేయాలి. తెల్లని వస్త్రాలు ధరించి, తెల్లని పుష్పాలతో పూజించాలి. అన్నపూర్ణ స్తోత్రాలు చదవాలి. భోజనశాలలో ఈ తల్లి చిత్రపటం ఉంచి, హారతులు ఇవ్వాలి.

మధురం.. మనోహరం

దుర్గమ్మ లడ్డూ అత్యంత ప్రీతిపాత్రం
























విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారి నేతి లడ్డూ ప్రసాదం అంటే భక్తులకు అత్యంత ప్రియం. తిరుమల నేతి లడ్డూ తర్వాత ఆస్థాయిలో భక్తులు భారీగా కొనుగోలు చేసేది దుర్గమ్మ ప్రసాదాన్నే. ఏటా దసరా శరన్నవరాత్రోత్సవాల్లో 20 లక్షలకు పైగా లడ్డూలను భక్తులు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. ఈ ఏడాది కూడా అక్టోబరు 03 నుంచి 12 వరకు జరుగుతున్న దసరా ఉత్సవాల్లో అమ్మవారి ప్రసాదాన్ని భారీగా తయారుచేస్తున్నారు. తొమ్మిది రోజుల దసరా వేడుకలు, ఆ తర్వాత రెండు రోజులు భవానీ దీక్షాదారుల రాక సందర్భంగా మొత్తం 25 లక్షల లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేస్తున్నారు.

– ఈనాడు, అమరావతి, - న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

రుచిలో ఏమాత్రం తేడా లేకుండా..

అమ్మవారి నేతి లడ్డూ తయారీకి ప్రధానంగా ఉపయోగించే శనగపిండిని సొంతంగా దేవస్థానం ఆధ్వర్యంలోనే తయారుచేస్తారు. నాణ్యమైన శనగపప్పును కొనుగోలు చేసి దానిని మిల్లులో ఆడించి సొంతంగా పిండిని సిద్ధం చేస్తారు. ఈ పిండిని నీటిలో ముద్దగా కలిపి నేతిలో వేయించి బూందీ తయారుచేస్తారు. ఇందుకు నాణ్యమైన విజయ డెయిరీ నెయ్యిని వినియోగిస్తారు. ఆ తర్వాత పంచదార పాకంలో ఈ బూందీని వేసి కొంత సమయం నానబెడతారు. బూందీ పాకంలో నాని.. ఉబ్బిన తర్వాత.. దానిలో యాలకుల పొడి, జీడిపప్పు, కిస్మిస్‌ను కలుపుతారు. జీడిపప్పును కలిపే ముందు నేతిలో దోరగా వేయిస్తారు. ఆ తర్వాత బాగా కలిపి లడ్డూ పోటును సిద్ధం చేస్తారు. దానిలో పచ్చ కర్పూరం సరిపోనంత వేస్తారు. లడ్డూకు మంచి వాసన రావడంతోపాటు ఎక్కువ రోజులు పాడవకుండా ఉండేందుకు పచ్చ కర్పూరాన్ని కలుపుతారు. ఈ మొత్తం ప్రక్రియలో ఎక్కడా ఎలాంటి మార్పు లేకుండా లడ్డూ నాణ్యత, రుచి ఒకేలా ఉండేలా ఏడాది పొడవునా తయారుచేయడం గొప్ప విషయం.

లడ్డూ ప్రసాదం 80, 400 గ్రాముల్లో రెండు రకాలుగా తయారుచేస్తుంటారు. ఈ లడ్డూల తయారీలో సుశిక్షితులైన 250 మందికి పైగా సిబ్బంది పాల్గొంటారు. ప్రసాదం పోటు తయారీ దగ్గర నుంచి లడ్డూలను చుట్టే వరకూ ప్రతి దశలో చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. లడ్డూ పోటును తయారుచేశాక పెద్ద పెద్ద ప్లేట్లలో ఉంచి.. దానిపై చిన్న పంచదార పటిక ముక్కలు వేసి.. ఆ తర్వాత ఉండలుగా చుట్టి.. ప్యాకింగ్ చేస్తారు. సాధారణ కౌంటర్లలో విక్రయించే లడ్డూలు 80 గ్రాములు, ప్రత్యేకంగా పూజలు, ప్రముఖులకు ఇవ్వడానికి 400 గ్రాముల లడ్డూలను సిద్ధం చేస్తున్నారు.



100 కిలోల పిండికి.. 5,640 లడ్డూలు..

- ★ శనగపిండి: 100 కిలోలు
- ★ పంచదార: 200 ”
- ★ నెయ్యి: 60 ”
- ★ జీడిపప్పు: 7.5 ”
- ★ కిస్మిస్: 5 ”
- ★ యాలకల పొడి:750 గ్రాములు
- ★ పచ్చ కర్పూరం: 150 ”
- ★ లడ్డూ బరువు: 80 ”

దసరా ఏర్పాట్లు బాగున్నాయి



మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

చిట్టినగర్, న్యూస్‌టుడే : దసరా ఏర్పాట్లు చాలా బాగున్నాయని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం గాయత్రీదేవి రూపంలో ఉన్న అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. చిన్న చిన్న లోపాలుంటే పరిష్కరించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అమ్మవారు ముఖ్యమంత్రి చంద్రబాబుకు శక్తిని ప్రసాదించాలని వేడుకున్నట్లు చెప్పారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆస్పత్రుల్లో సహాయకులకు నైపుణ్య శిక్షణ

ఈనాడు, అమరావతి: ఆస్పత్రుల్లో రోగుల పడకల వద్ద సహాయకులుగా పని చేసే వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శ్రీసత్యసాయి సేవా ట్రస్టుతో ఒప్పందం కుదుర్చుకుంది. తాడేపల్లిలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఈ ఒప్పందం జరిగింది. దీని ప్రకారం పదో తరగతి ఉత్తీర్ణులు, ఇంటర్మీడియట్, అండర్ గ్రాడ్యుయేట్ చదువు మధ్యలో నిలిపివేసిన వారు, నిరుద్యోగ యువతకు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. ఆన్ జాబ్ శిక్షణతో కలిపి మొత్తం ఐదు నెలలు ఈ కోర్సు ఉంటుంది. శిక్షణ పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఒప్పందం కుదుర్చుకునే కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్ ట్రస్టీ జి.సాయి విశ్వనాథం, ఏపీఎస్‌ఎస్‌డీసీ ఈడీ దినేష్‌కుమార్, నర్సింగ్ నైపుణ్యాభివృద్ధి అధికారి రేహనాఖాన్ పాల్గొన్నారు.

‘ఆ జీఓను వెనక్కు తీసుకోవాలి’

ఈనాడు, అమరావతి: ఎసైన్డ్ భూముల్లో ఇసుక తవ్వుకోవడానికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓను వెనక్కి తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వం పేదలకిచ్చిన ఎసైన్డ్ భూముల్లో మైనింగ్ తవ్వరాదని, ఆక్వా సాగు చేయకూడదని.. పేదలు, వారి కుటుంబాలు తరతరాలుగా ఆ భూమిని అనుభవించాలని చట్టం చెబుతోందని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించి రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయం దళితులు, పేదలకు వ్యతిరేకమైందని, ఇప్పటికే లక్షల ఎకరాల పేదల భూములను పెత్తందార్లు దౌర్జన్యంగా, అక్రమంగా అనుభవిస్తున్నారని ఆరోపించారు.

పన్నెండోసారి బెంగళూరుకు జగన్

ఈనాడు, అమరావతి: మాజీ సీఎం, వైకాపా అధ్యక్షుడు జగన్ శుక్రవారం మరోసారి బెంగళూరుకు వెళ్లారు. గత నెల 28న బెంగళూరుకు వెళ్లిన ఆయన మంగళవారం తిరిగొచ్చారు. మూడు రోజులకే మళ్లీ అక్కడికే పయనమయ్యారు. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక జగన్ బెంగళూరుకు వెళ్లడం ఇది 12వ సారికావడం గమనార్హం.



ఫలితాలను తీసుకొచ్చేది పని మాత్రమే

మీరు బలంగా కోరుకున్నంత మాత్రాన ఏదీ మీకు దక్కదు. విద్య, సామర్థ్యాల్లాంటి అర్హతలు ఉన్నంత మాత్రాన ఏవీ వచ్చి మీ ఒళ్లో వాలవు. అమోఘమైన తెలివితేటలు మీకున్నా అన్నీ మీ దరి చేరవు. మీరు వేటి కోసమైతే నిజంగా కష్టపడి పనిచేస్తారో అవి మాత్రమే మిమ్మల్ని వరిస్తాయి. ఫలితాలను తీసుకొచ్చేది ఆశలు, ఆకాంక్షలు కాదు.. అంకితభావంతో స్థిరంగా పనిచేసే గుణమే.

– కోరీ విల్సన్, బిజినెస్ కన్సల్టెంట్

ఉన్నత విద్యలో ఆన్‌లైన్ పరీక్షల విధానం

- విశ్వవిద్యాలయాల్లో ఆన్‌లైన్‌లోనే ప్రశ్నపత్రాల రూపకల్పన
- కంప్యూటర్‌లో జవాబుపత్రాల మూల్యాంకనం
- మార్కులు ట్యాంపరింగ్ చేయకుండా పారదర్శకతకు ప్రభుత్వం చర్యలు

ఈనాడు, అమరావతి: విశ్వవిద్యాలయాల్లో పరీక్షల విధానాన్ని కంప్యూటరీకరణ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డిగ్రీ, పీజీ పరీక్షల ఫలితాల్లో పారదర్శకత, మార్కుల్లో కచ్చితత్వం, పరీక్షల నిర్వహణను పటిష్ఠం చేసేందుకు ఈ విధానాన్ని తెస్తోంది. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ‘సమగ్ర పరీక్షల నిర్వహణ విధానం’ అమలు చేయనుంది. గతంలో కాగ్ సైతం ప్రశ్నపత్రాల మూల్యాంకనంలో లోపాలు ఉన్నట్లు బహిర్గతం చేసింది. మొదట పరీక్షల్లో తప్పినా, పునర్ మూల్యాంకనంతో ఉత్తీర్ణులవుతున్న వారి సంఖ్య కొన్ని వర్సిటీల్లో 40% వరకు ఉంటోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో గతంలో బీఈడీలో 52 మంది పునర్ మూల్యాంకనానికి దరఖాస్తు చేస్తే వీరిలో 30 మంది మార్కులు మారాయి. పీజీలో ఒక కోర్సుకు 80 మంది దరఖాస్తు చేస్తే 52 మందికి మార్కులు పెరిగాయి. ఆంధ్ర, ఆదికవి నన్నయ, ఎస్వీ యూనివర్సిటీల్లో పునర్ మూల్యాంకనం బాగోలేదని గతంలో కాగ్ హెచ్చరించింది. విశ్వవిద్యాలయాల్లో పరీక్షల నిర్వహణ విభాగానికి, ఇతర విభాగాలకు మధ్య సమన్వయం లేదు. గతంలో నాగార్జున వర్సిటీలో కొన్ని బీఈడీ కళాశాలలకు ప్రవేశాలకు అనుమతులు లేకపోయినా పరీక్షల విభాగం పరీక్షలు నిర్వహించి, ఫలితాలు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. వర్సిటీల్లో ఇలాంటి పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నాలు మొదలయ్యాయి.

ఆన్‌లైన్ మూల్యాంకనం..

కొత్తగా తెచ్చే సంస్కరణల్లో భాగంగా ప్రశ్నపత్రాల మూల్యాంకనాన్ని ఆన్‌లైన్ చేయనున్నారు. పరీక్షలు పూర్తయ్యాక జవాబుపత్రాలను స్కానింగ్ చేస్తారు. అభ్యర్థి పేరు లేకుండా వీటికి కోడ్ కేటాయిస్తారు. అనంతరం వీటికి పాస్‌వర్డ్ పెడతారు. వర్సిటీల్లో ఈ విభాగం చూసే అధికారులు జవాబుపత్రాలను మూల్యాంకనం కోసం ఆన్‌లైన్‌లోనే అధ్యాపకులకు పంపిస్తారు. వారు కంప్యూటర్‌లోనే మూల్యాంకనం చేసి, సబ్మిట్ చేయగానే సంబంధిత అధికారికి ఇవి వస్తాయి.

★ మార్కులు రాగానే ఆటోమేటిగ్గా ఆయా వర్సిటీల లోగో, నమూనాతో మెమోల్లోకి ఈ మార్కులు వచ్చేస్తాయి. వీటిని డిజి లాకర్‌కు అనుసంధానిస్తారు. అభ్యర్థులు తమ మార్కుల మెమోలను డిజి లాకర్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

★ పునర్ మూల్యాంకనానికి దరఖాస్తు చేసేవారికి అవసరమైతే వారు రాసిన జవాబుపత్రాలను అందించే అవకాశం ఉంటుంది. మూల్యాంకనం సైతం తొందరగా పూర్తవుతుంది. ఏటా అన్ని వర్సిటీల పరిధిలో 8 లక్షల మంది పరీక్షలు రాస్తున్నారు.

ప్రశ్నల బ్యాంకు ఏర్పాటు

ప్రశ్నపత్రాలనూ కంప్యూటర్ ద్వారానే రూపొందిస్తారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలబ్యాంకును ఏర్పాటు చేస్తారు. వాటిలో నుంచి ఆన్‌లైన్‌లోనే ప్రశ్నపత్రం రూపొందిస్తారు. ప్రశ్నపత్రాలను ఆన్‌లైన్‌లో పంపించాలని భావిస్తున్నా క్షేత్రస్థాయి పరిస్థితుల కారణంగా మొదట్లో కొంతకాలం ముద్రించిన ప్రశ్నపత్రాలను పంపాలని నిర్ణయించారు. ప్రశ్నపత్రాలను ముద్రించడం, వాటిని సరఫరా చేయడం లాంటివి లేకుండా పరీక్షకు 15 నిమిషాల ముందు ప్రశ్నపత్రాన్ని ఆన్‌లైన్‌లో పాస్‌వర్డ్‌తో పంపించి, వాటిని ప్రింట్లు తీసుకొని, అభ్యర్థులకు ఇచ్చే విధానంపై ఆలోచన చేస్తున్నారు.

★ వర్సిటీల్లో పరీక్షల విభాగం కంప్యూటరీకరణ ప్రక్రియ కోసం ప్రైవేటు సాఫ్ట్‌వేర్ సంస్థలను ఎంపిక చేసేందుకు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా ఉన్నత విద్యాశాఖ టెండర్లు పిలిచింది. ఈ నెల 15 వరకు బిడ్లు స్వీకరిస్తుంది. సంస్థలను ఎంపిక చేశాక ఉన్నత విద్యాశాఖ వర్సిటీలకు కేటాయించనుంది.

కర్ణాటకలో లేని ప్రైవేటీకరణ విశాఖలో ఎందుకు?

- ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలి
- సీపీఐ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల. చిత్రంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

ఈనాడు డిజిటల్, అమరావతి: కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి తన రాష్ట్రంలోని మూతపడిన ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించుకున్నారని, 23 మంది ఎంపీలు ఉన్నా.. ఎన్డీయే ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఎందుకు అడ్డుకోవడంలేదని వక్తలు ప్రశ్నించారు. పదేళ్లుగా రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా భాజపాకే మద్దతిచ్చాయని, ఒక్క విభజన హామీని అమలు చేయకున్నా ఊడిగం చేశాయని మండిపడ్డారు. విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నేతలతో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయిస్తే అదే లాభాల్లోకి వస్తుందని అన్నారు. ప్రైవేటీకరణ ఆలోచన మానుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి లేఖ అందించాలని నిర్ణయించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల మాట్లాడుతూ.. ‘ప్రస్తుతం భాజపా కేంద్రంలో అధికారంలో ఉండటానికి కారణం తెదేపా ఎంపీలే. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వారు ఎందుకు మాట్లాడటంలేదు. కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు చేస్తోందని ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి అంటున్నారు. కానీ అవి చేసేది భాజపానే. యూపీఏ అధికారంలో ఉన్నన్ని రోజులూ ఫ్యాక్టరీ లాభాల్లోనే ఉంది. భాజపా అధికారంలోకి వచ్చాకే అప్పుల పాలైంది’ అని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. ‘ప్రైవేటీకరణ చేయాలనేది రాజకీయ నిర్ణయం. 10 ఏళ్లుగా ఆందోళనలు చేస్తున్నా.. ప్రైవేటీకరణే మా విధానమని నేరుగా చెబుతున్నారు. ప్రతిపక్ష నేతలుగా మాట్లాడే హక్కు మాకుంది. రాజకీయ పార్టీలు, నాయకులు, విద్యార్థులు, మేధావులు దీనిపై మాట్లాడాలి. భాజపా నాయకులు ప్రైవేటీకరణ చేస్తామని చెబుతుంటే తెదేపా, జనసేన పార్టీలు మాత్రం రోజుకో మాట మాట్లాడుతున్నాయి’ అని మండిపడ్డారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ‘విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయిస్తే ఏటా రూ.3వేల కోట్ల లాభాలు ఆర్జిస్తుంది. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలోని మర్లపాడులో సుమారు 1,300 ఎకరాల్లోని గనులను జిందాల్ కంపెనీకి కేటాయించారు. వాటిని విశాఖ ఉక్కు పరిశ్రమకు కేటాయించాలి’ అని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ‘ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అందుకే ప్లాంట్‌కు రావాల్సిన గనులను తొలగిస్తోంది. ప్రైవేటీకరణ చేసి అదానీకి అప్పజెప్పాలని చూస్తోంది’ అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నర్సింగరావు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తునకు సహకరించండి

- వైకాపా నేత సజ్జలకు హైకోర్టు ఆదేశం
- ముందస్తు బెయిలు పిటిషన్‌పై విచారణ 25కు వాయిదా

ఈనాడు, అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయంపై మూకుమ్మడి దాడి కేసులో దర్యాప్తునకు సహకరించాలని వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 25కు వాయిదా వేసింది. అప్పటి వరకు ఆయన అరెస్టు విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టంచేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు. తెదేపా కార్యాలయంపై దాడి కేసులో తనను నిందితుడిగా చేర్చారని, వాస్తవానికి ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని, ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ సజ్జల రామకృష్ణారెడ్డి హైకోర్టులో వ్యాజ్యం వేసిన విషయం తెలిసిందే. సజ్జల రామకృష్ణారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. తెదేపా కార్యాలయంపై దాడి ఘటన రోజున పిటిషనర్ పోరుమామిళ్లలో, ఘటనా స్థలానికి 600 కి.మీ దూరంలో ఉన్నారని కోర్టుకు నివేదించారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, పీపీ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు.

దాడి ఘటన రోజు సజ్జల రామకృష్ణారెడ్డి తాడేపల్లి వైకాపా కార్యాలయంలో ఉన్నట్లు ఇద్దరు సహ నిందితులు, ఇద్దరు సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారని తెలిపారు. దేవినేని అవినాష్ అనుచరుడు, ఈ కేసులో 13వ నిందితుడు షేక్ సైదా ఇచ్చిన వాంగ్మూలంలో ఆ రోజు సాయంత్రం 3 గంటలకు వైకాపా కార్యాలయంలో పిటిషనర్‌ను చూసినట్లు వెల్లడించారన్నారు. సజ్జల ప్రోద్బలంతోనే దాడి చేసినట్లు షేక్ సైదా చెప్పారని తెలిపారు. దాడి ఘటనలో సజ్జల రామకృష్ణారెడ్డి పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభించాయని పేర్కొన్నారు.

నందిగం సురేష్‌కు షరతులతో బెయిలు

దర్యాప్తునకు అందుబాటులో ఉండాలన్న హైకోర్టు

ఈనాడు, అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్, వైకాపా సానుభూతిపరుడు అవుతు శ్రీనివాసరెడ్డిలకు హైకోర్టు షరతులతో కూడిన రెగ్యులర్ బెయిలు మంజూరు చేసింది. మంగళగిరి మొదటి తరగతి అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో రూ.15వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. అభియోగపత్రం దాఖలు చేసేవరకూ ప్రతి నెలా 1, 15వ తేదీల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు ఏదో ఒక సమయంలో దర్యాప్తు అధికారి (ఐఓ) ముందు హాజరుకావాలని ఇద్దరినీ ఆదేశించింది. దర్యాప్తు నిమిత్తం పోలీసులు కావాలన్నప్పుడల్లా అందుబాటులో ఉండాలని పిటిషనర్లకు తేల్చిచెప్పింది. ఈ కేసులో ఎవరినీ ప్రలోభపెట్టడం, బెదిరించడం చేయవద్దని ఆదేశించింది. ఇలాంటి నేర ఘటనలను పునరావృతం చేయవద్దని స్పష్టం చేసింది. దిగువ కోర్టులో విచారణ ప్రక్రియలో పాల్గొనాలని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ఈ మేరకు తీర్పు చెప్పారు.

★ పోలీసులకు నందిగం సురేష్ మొబైల్ ఫోన్లను అప్పగించకపోవడాన్ని దర్యాప్తునకు సహకరించనట్లుగా చెప్పలేమని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. పిటిషనర్లను సెప్టెంబరు 4న అరెస్టు చేశారని, నెల రోజులుగా జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారని గుర్తుచేశారు. పోలీసు కస్టడీ పూర్తయిందన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని బెయిలు మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

ఏఆర్ డెయిరీ ఎండీ ముందస్తు బెయిలు పిటిషన్ 17కు వాయిదా

ఈనాడు, అమరావతి: ఏఆర్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ ఆర్.రాజశేఖరన్ హైకోర్టులో దాఖలు చేసిన ముందస్తు బెయిలు పిటిషన్‌పై విచారణ ఈ నెల 17కు వాయిదా పడింది. శ్రీవారి లడ్డూ తయారీకి జంతువుల కొవ్వుతో కల్తీ చేసిన నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణలతో తనపై తిరుపతి తూర్పు ఠాణాలో సెప్టెంబరు 25న నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిలు మంజూరుచేయాలని రాజశేఖరన్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. శుక్రవారం నాటి విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. లడ్డూ విషయమై సుప్రీంకోర్టులో చోటుచేసుకున్న పరిణామం నేపథ్యంలో తమ పిటిషన్‌ను ఈ నెల 17కు వాయిదా వేయాలని కోరారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ విచారణను వాయిదా వేశారు.